# దిగుడు బావి

అనోక ఊరన్న పేరేగాని, అక్కడ నిజంగా పట్టుమని పదిళ్ళయినా లేవు. అవైనా ఎడం ఎడంగా ఉన్నాయి. ఊరంతా కొండరాళ్ళు. అని ఆ ఊరి దరిద్రానికి చిహ్నం. ఎక్కడా పచ్చని పైరు కనిపించదు. ఏ గుమ్మమూ సంపదతో కళకళ లాడదు. మాసిన గుడ్డలు, వడినముఖాలు బ్రతుకు బరువుతో నీరసించిన వ్యక్తులు; పుల్లలు ఏరుతూ మేకలు మేపుతూ, బట్టలు అల్లుతూ ఎలాగో జీవనం సాగుతుంది. అవతలి లోకం అంతా ఒక వింత: దానితో వారికి సంబంధంలేదు.

ఆ ఊరికి అరమైలు దూరంలో పెద్దకొండ ఉంది. దట్టంగా చెట్లతో నిండి వుంటుంది. ఆ చెట్లమధ్య కొండ మీదికి సన్నని త్రోవ వుంది. మిట్టమధ్యాహ్నంకూడా సూర్యరశ్మి సోకదు. త్రోవంతా చల్లగా వుంటుంది. కాస్త దూరం వెడితే కొంత బయట, పెద్ద నీటిధారలు, కనిపిస్తాయి. అంత నీరు ఎలా వస్తుందో ఎటుపోతుందో స్పష్టంగా తెలియదు. ఆ ధారకు 'అంబుధార' అని ఆ చుట్టుపట్ల ప్రసిద్ధి.

ఆ ఊరికి చివర శివాలయం ఉంది. ఆలయానికి

వెనుక మల్లెతోట ఉంది. ఆతోటకి అవతలివేపున పెద్ద దిగుడుబావి వుంది. చుట్టూ నలుచదరంగా మెట్లు ఉన్నాయి. నాలుగువేపుల నించి క్రిందకు దిగవచ్చు, బావి విశాలంగా ఉంది. ఎప్పుడూ నీళ్లు మెట్లను తాకుతూ ఉంటాయి. మెట్లదగ్గర నీటితీగలు అల్లుకుని ఉన్నాయి. పై భాగాన చుట్టూ ప్రహారీగోడ ఎత్తుగా ఉంది. అక్కడ నుంచి చూస్తే అదొక చెరువులా అనిపిస్తుంది.

ఆ గుడి, మల్లెతోట, దిగుడుబావి, అంబుధార, ఎప్పటి నుంచి ఉన్నాయో తెలియదు. అవి చూడడానికి జనం వస్తూనే ఉంటారు, ముఖ్యంగా శివరాత్రికి అక్కడ తిరుణాల జరుగుతుంది. చుట్టుపక్కల ఊళ్ళవాళ్ళంతా వస్తారు. ఎక్కడ చూసినా తీర్థ ప్రజ. ఆ ఒక్కరోజు గుడిచుట్టూతా అంగళ్ళు వెలుస్తాయి. ఆవేళ సంపాదించిన డబ్బు ఆ ఊరి వాళ్ళు చాలా రోజులు దాచుకుంటారు. ఆ ఊరికి మరొక కొసన చిన్న బంగళా ఉంది ఆ ఊరికి ఎవరైనా ఉద్యోగస్థులు వస్తే అక్కడే ఉంటారు. శివరాత్రికి వచ్చే జనానికి అది ఎటూ చాలదు. అంతా గుడిచుట్టూ ఎక్కడపడితే అక్కడే వుంటారు. అక్కడే వంటలు చేసుకుంటారు. శివరాత్రి వెళ్ళిన పదిరోజులవరకూ గుడి చుట్టూతా చికాకుగా వుంటుంది: ఎంగిలాకులు, కాలి చల్లారిన కట్టె పుల్లలూ!

మల్లెతోటకి వెనక, పాకలో కనకాంగి కాపురముంది. ఆమె భర్త గుళ్లో పని చేసేవాడు అతనుపోయి మూడేళ్ళయింది. గుడిముందు తుడవడము తోటకు నీళ్ళు పెట్టడం

ఇప్పుడు కనకాంగి చేస్తోంది. ముసలిమామగారున్నారు, ఇద్దరు పిల్లలు, ఎదిగిన కూతురు చంద్రమల్లి, చిన్నపిల్లవాడు కుందన్.

చంద్రమల్లి ఎప్పుడూ ఇంటిపట్టున వుండదు; తిరుగుడు ఎక్కువ. ఆమెకు పై వూరువాళ్లు వింతగా తోస్తారు. వాళ్లను చుట్టుకు తిరుగుతుంది. శివరాత్రి వస్తే అసలు కాలు నిలువదు. తల్లి చిన్నచిన్న మూతబుట్టలు అల్లుతుంది. చంద్రమల్లికి అవి అమ్మడమనేది ఒకసాకు. అవి పట్టుకుని అందరి చుట్టూ తిరుగుతుంది. రాత్రి సద్దుమణిగాక అలసిపోయి ఇంటికి వచ్చి నిద్రపోతుంది డబ్బు లెక్క తెలియదు. అది కనకాంగి చూచుకోవాలి.

చంద్రమల్లి ఆడపిల్లలా తిరగడం కనకాంగికి ఇష్టం లేదు. "పొరుగూరి వాళ్లతో నీకు మాటలేమిటి? వాళ్ళ వెనకాలే తిరుగుతే నీకేం ఒరుగుతుంది. అంటుంది?" చంద్రమల్లి వినిపించుకోదు. ఆమెకు ప్రొద్దుపోదు కొత్త ముఖం చూడగానే కుతూహలం కలుగుతుంది. ఏదో వింత ఆకర్షణంతో పరుగెత్తుతుంది.

ఎప్పుడైనా తల్లి కోప్పడుతుంది: "ఎంత చెప్పినా వినవు! ఎప్పుడో తల పగలగొట్టుకుంటావు! ఆ జీవ లాగ ఎందుకూ కొరగాకుండా పోతావు! దానిలాగే శిఖండి బ్రతుకు అవుతుంది." అంటుంది. చంద్రమల్లి భయపడుతుంది. జీవ ఆమె స్నేహితురాలు. అది మొరటుగా వుంటుంది. తల దువ్వుకోదు. ఎవరికీ లక్ష్యపెట్టదు. ఊరికేనే విరుచుకు పడు

తుంది. ఆ ఊళ్లో అందరూ దాన్ని "శిఖండి" అంటారు. ఎప్పుడో అది ఊరు వదలి వెళ్ళిపోయింది. మళ్లా కొన్నాళ్లకు తిరిగివచ్చింది. మనిషి మారిపోయింది. మొరటుగా తయారైంది. దాన్నెవరూ పెళ్ళి చేసుకోలేదు. శిఖండి బ్రతుకులా అయింది. అలానే, ప్రేమించి వెళ్ళిన వ్యక్తి ఆదరించలేదు. మరొక వ్యక్తికి అది పనికిరాలేదు. బ్రతుకుచెడిన ఆడది అలానే అవుతుంది. స్త్రీ లక్షణాలన్నీ మరుగు పడతాయి. అందవికారమైన మొరటుదనం మొలకెత్తుతుంది. సిగ్గు, మమత, కరుణ, క్షమ వేమి మిగులవు. కరకుదనం, పగ, ద్వేషము అలముకుంటాయి. స్త్రీ ప్రకృతి నశించి పురుష ప్రకృతి తల ఎత్తుతుంది. అందుకే దాన్ని శిఖండి అంటారు. తల్లిమాటకు చంద్రమల్లికి బాధ కలుగుతుంది. అయినా జీవ ఆంతర్యం ఆమెకు తెలుసు. దాని హృదయంలో శోకం నిద్రపోతోంది. మమత మరుగుపడింది. ఒక వస్తువు మీాది మమకారం భంగమైతే మళ్ళా మరొక వస్తువుమీాద మమత కలుగదు. అందుకే అది మొరటుదనంగా తోస్తుంది.

పొద్దునవేళ గుమ్మంముందు తాత చుట్ట కాల్చుకుంటూ కూర్చుంటాడు. చంద్రమల్లి పక్కనే కూర్చుంటుంది. తాత మెల్లగా మాటలు ప్రారంభిస్తాడు. చివరకు అంటాడు: "ఎప్పుడో వచ్చి పొయ్యేవాళ్లతో స్నేహాలేమిటమ్మా! ఏదో ఒకరోజు ఉంటారు; పోతారు; మళ్లా వాళ్లెవరో! మనమెవరో! మనసుకు బాధ. చంద్రమల్లి ఈ మాటలు విని

పించుకోదు. తాత చెప్తున్నంతసేపు ముళ్లమీద వున్నట్లు వుంటుంది. అంతలో దిగుడుబావి మెట్లమీద కొత్త గొంతులు వినిపిస్తాయి. ఒక్క అంగలో పారిపోతుంది. కనకాంగి లోపలనుంచి పరుగెత్తుకు వస్తుంది. కనకాంగి పిలుపుకు చంద్రమల్లి తిరిగైనా చూడదు. కనకాంగి గుండె రాయి చేసుకుంటుంది. “పోనీలే! కాస్త ఎదిగితే దానికే తెలుస్తుంది,” అనుకుంటుంది.

అప్పటికి శివరాత్రి గడచి పదిరోజులైంది. ఊరంతా బోసిగావుంది. ఏమీ తోచక, చంద్రమల్లి దిగుడుబావి మెట్లమీద కూర్చుంది. పొద్దుపోకపోతే అక్కడే వుంటుంది. ఎప్పుడైనా జీవ కూడా వస్తుంది. ఇద్దరూ నీళ్లలో నీడలు చూస్తూ కూర్చుంటారు. ఆ వేళ హరిరావు అక్కడికివచ్చాడు. నీళ్ళల్లో దిగి దోసిలితో నీళ్లు తీసుకుని ముఖం కడుక్కున్నాడు. చేతిలో సంచి మెట్లమీద పెట్టాడు. అతన్ని చూడగానే జీవ వెళ్ళిపోయింది చంద్రమల్లి అలానే చూస్తూ కూర్చుంది, అతనేదో వింత వస్తువులా. ఆ వూరు ఎప్పుడూ ఇద్దరు ముగ్గురు కలిసేవస్తారు. ఒంటరిగా ఎవరూ రారు. హరిరావు ఎప్పుడు వచ్చాడో చంద్రమల్లికి తెలియదు. అంతకుముందు ఆమె చూడలేదు. మెట్లమీద సంచి ఒక పెద్దకోతి వచ్చి పట్టుకుంది. లోపల ఏముందో తడవి చూస్తోంది. చంద్రమల్లి దాన్ని బెదరించింది. అది సంచి వదలి దూరంగా పోయింది. హరిరావు సంచి అందుకుని అందులోంచి చిన్న టవలు తీసుకున్నాడు చంద్రమల్లి మాటలు ప్రారంభించింది: – “సంచి

కోసం కోతి వచ్చింది" అన్నది. "చూశాను" అన్నాడు అతను, ముభావంగా. ఇంకేమీ మాట్లాడలేదు. సంచి తీసుకుని వెళ్ళిపోయాడు. చంద్రమల్లి వెనకాలే కొంతదూరం వెళ్ళింది. అతను బంగళాకు వెళ్ళాడు. ఆమె వెనక్కు మళ్ళింది. పొద్దువాలింది.

తల్లి అన్నం పెట్టింది. చంద్రమల్లికి తినాలనిపించలేదు. ఆమె కళ్ళకు అతని రూపమే కనిపిస్తూ ఉంది. మెల్లగా వెళ్ళి, పడుకుంది.

మర్నాడు బంగళాకు వెళ్ళి కనుక్కుంది. అతనెవరో కాపలావాడు రామయ్య చెప్పాడు. అతను ఏదో పనిమీద ఈ ఊరు వచ్చాడని, కొన్నాళ్ళు ఇక్కడే ఉంటాడని, చంద్రమల్లికి ఆసక్తి హెచ్చింది. దేవుణ్ణి చూడడానికి తప్ప ఆ ఊరు ఇకెవరూ రారు. ఒక్కరోజుకన్నా వుండరు. ఆమె బంగళాదగ్గర తిరుగుతూ ఉంది, అతన్నే చూస్తూ. అతను ఎక్కడికైనా వెడితే వెనకాలే వెళ్ళింది. అతను సాయంత్రం వేళ దిగుడుబావి మెట్లమీద కూర్చుంటాడు. ఏదో రాసుకుంటూ. చంద్రమల్లి తనూ అవతలివేపు మెట్లమీద కూర్చుంది. మొదట హరిరావు ఆమెను గమనించలేదు. పలకరించలేదు. ఆమెకు అతనితో మాట్లాడాలన్న కుతూహలమెక్కువైంది. ఒకసారి వెళ్ళి పలకరించింది. "ఏమిటి! మీరు రోజూ రాస్తారు?" అని అడిగింది. అతను నవ్వాడు. వెంటనే జవాబు చెప్పాడు. "ఏమీలేదు ఇక్కడ చూసినవన్నీ రాసుకుంటున్నాను." అన్నాడు. ఆమెకు అర్థం కాలేదు. "ఏం

చూశాడు? ఏముంది రాయడానికి?" అనుకుంది. "ఎందుకూ?" అన్నది మళ్లా. ఆమెకు వివరించి చెప్పే ఓపిక లేదు. అతనికి "ఏమీ లేదు. అది నా ఉద్యోగం, అన్ని ఊళ్ళు చూస్తాను. అంతే" అన్నాడు ఆమెను గురించి అడిగాడు. ఆమె చెప్పింది. "నేను ఎప్పుడూ ఏ ఊరూ వెళ్లలేదు." అన్నది. "నేను పట్నం తీసుకువెడితే వస్తావా!" అన్నాడతను నవ్వుతూ. అది నిజమో, పరిహాసమో తెలియక ఆమె జవాబు చెప్పలేదు; అంతే. అతనితో ఆమెకు చనువు ఏర్పడింది. రోజూ దిగుడుబావి మెట్లమీద అతనితో కబుర్లు చెబుతూ కూర్చుంది. బంగాళాకు వెళ్ళి అతనికి కావలసిన వస్తువులు తెచ్చి పెట్టింది. చివరకు అతనికి దూరంగా ఒక్క క్షణమైనా వుండలేని పరిస్థితిలో తగుల్కొన్నది.

కనకాంగి ఒకరోజు మధ్యాహ్నం కూతురుతో చెప్పింది. బంగళాలో వున్నతను ఈ బుట్టలేమైనా కొంటాడేమో అడగరాదూ" అని, ఎప్పుడూ డబ్బు ఆలోచన చంద్రమల్లికి నచ్చదు. అయినా బంగళాకు వెళ్ళడానికి అది ఒక సాకు. అందుకని వెళ్ళింది హరిరావు నిద్రపోతున్నాడు. ఆమె మెల్లగా పిలిచింది. అతను లేవలేదు. మెల్లగా తలుపు తోసింది. తెరుచుకుంది. ఆమె హరిరావు దగ్గరకు వెళ్లింది. అతను ఇంకా నిద్రపోతున్నాడు. ఏం చేస్తోందో తెలియకుండా అతని భుజం తట్టి లేపింది. ఆ క్షణం ఆమె అన్నీ మరచిపోయింది. అతను ఉలిక్కిపడి ఆమెకేసి వింతగా చూచాడు. ఆమె మెల్లగా "మా అమ్మ

మీ కీ బుట్టలు కావాలేమో అడగమంది" అన్నది. అతనికి నవ్వాగలేదు. ఆమెను గట్టిగా దగ్గరగా లాక్కున్నాడు. ఆమె చేతిలోనించి బుట్టల దొంతర జారి క్రిందపడింది. ఆమె భయపడింది. అయినా విడిపించుకోటానికి ప్రయత్నించలేదు: అక్కడనుంచి వెళ్ళిపోలేదు.

ఆ తరువాత ఆమెకు ఏదో మైకంలో ఉన్నట్లు ఉంది. ఆమె ప్రకృతి మారింది. స్వేచ్ఛగా విహరిస్తున్న విహంగం శాశ్వతంగా బంధనంలో పడ్డట్లనిపించింది. ఆమె ఇంక పూర్తిగా హరిరావుకు చెందిన వ్యక్తి. అతను ఆదరిస్తే అదృష్టవంతురాలు; కాకపోతే అధోగతి. జీవితపు ఆశా నిరాశల సరిహద్దుటంచుమీద ఆమె బ్రతుకు ఆ క్షణం నిలచింది. ఒక వైపు పరిపూర్ణత, ఆనందము; మరొకవైపు అవమానము, అంధకారము.

ఆమె ఒంటరిగా అంబుధారకు వెళ్ళింది. కొండ గట్టుమీద ఎంతో ఎత్తునుంచి ధారవురవడిగా పడుతోంది. ఆమె ఆ ధారకు దగ్గరగా పడుకుంది. నీటి బిందువులు చింది ఆమె ఒంటినిండా పడుతున్నాయి. చల్లటిగాలి వీస్తోంది. ఆకాశం మబ్బు పట్టి ఉంది. ఎక్కడా మనిషి అలికిడి లేదు. బ్రతుకు ఈ క్షణమే ఇక్కడ అంతమవుతే బాగుండు ననిపించింది, ఆమెకు. కాస్సేపటికి హరిరావు వచ్చాడు. ఆమె అతన్ని చూచింది, అయినా లేవలేదు. అలాగే పడుకుంది. అతను దగ్గరగా వచ్చాడు. "అలా నీళ్ళదగ్గర పడుకున్నావేం? జారి పడిపోతే? లే! లే!" అన్నాడు. ఆమె వినిపించుకోలేదు.

అతనూ వెళ్ళి అక్కడే కూర్చున్నాడు. ఆమె నవ్వింది. "నీకు బొత్తిగా భయంలేదు" అన్నాడు. "నీకు భయమా?" అన్నది ఆమె పరిహాసంగా. అతను మాట్లాడలేదు. ఆమెకు ఏదో తోచింది. "నాతో మొదట నీవు మాట్లాడనేలేదు" అన్నది. అతను నవ్వాడు. "అవును నిన్ను పలకరించడానికి నాకు భయంవేసింది." అన్నాడు. "ఎందుకూ?" అన్నది, ఆమె. అతను చిలిపిగా నవ్వాడు. "నీ ముఖం చూచి మంచి కుటుంబంలో పిల్లవనుకున్నాను. మంచివాళ్ళంటె నాకు భయం" అన్నాడు. ఆ మాట, ఆ నవ్వు ఆమె మనస్సులో ముల్లులా గుచ్చుకున్నాయి. "ఇప్పుడో?" అన్నది నీరసంగా.

"ఇప్పుడా?" అని అతను మళ్లా పరిహాసంగా నవ్వాడు. ఆ నవ్వు ఆమె కర్థమైంది. ఇప్పుడు తాను మంచిదికాదు, శిథిలమైంది. అది అతనికే స్పష్టంగా తెలుసు. ఆమె శరీరమంతా ఒక్కసారి దహించుకు పోతున్నట్లనిపించింది. దుఃఖము ముంచుకు వచ్చింది. ఎవరికోసం శిథిలమైందో అతనికే తాను చులకన!

ఆమె లేచి నిలబడింది. కొండ దిగి వెళ్ళిపోతుంది. అతను ఆమెలో మార్పు గమనించలేదు. యథాలాపంగా లేచి వెనకాలే వెళ్ళాడు. శివాలయం దగ్గర ఆమె ఆగింది. అతను ఆమె దగ్గరకు వచ్చాడు, ఆమెతో మాటవరసగా

చెప్పాడు: "నేను రేపు వెళ్ళిపోతాను. నాకిక్కడ పని పోయింది, రేపు మధ్యాహ్నం రైలులో వెళతాను" అని, ఆమె అదిరిపడ్డది. అతను వెళ్ళిపోయాడు. ఆమె అలాగే నిలబడింది. అతను ఆమె బాధను తెలుసుకోలేదు; ఆమెను ఓదార్చలేదు. అది గుండెలలో కత్తితో పొడిచినట్టుంది. అతను ఇంక మళ్ళా కనిపించడు ఆ బెంగ క్రుంగదీస్తోంది. శూన్యంగా ఎటుపోతోందో తెలియకుండా సాగిపోయింది. ఇంటికి వెళ్ళగానే విరిగి కప్ప కూలిన తరువులా నేల కరచుకు పడుకుంది. కుందన్ వచ్చి నెత్తిన పడ్డాడు. ఆమె కదలలేదు. వాడికి భయంవేసింది. ఆమె మట్టిబొమ్మలా వున్నట్లనిపించింది. దూరంగా పారిపోయాడు.

ఆమెకు తెల్లవార్లూ నిద్రపట్టలేదు. ఏదో తెలియని మూగబాధ క్రుంగదీసింది. ఎన్నోసార్లు లేచి బంగళాలో అతని దగ్గరకు పారిపోవాలనిపించింది. కాని, అందుకు కూడా తనలో శక్తి లేనట్లనిపించింది. ఉదయం, శూన్యంగా, దిక్కుతోచకుండా కూచుంది. అతను వెళ్లిపోతాడు. ఇంక తనకు కనిపించడు. అది ఒక్కటే ఆలోచన. మెదడులో సుత్తితో కొట్టినట్టు మళ్లా మళ్లా మెదిలింది, కాస్సేపటికి మెల్లగా లేచి, బంగళాకు వెళ్ళింది. అతను ఏవో సర్దుకుంటున్నాడు. ఆ క్షణం ఆమె రావడం అతనికేదో చిరాకు కలిగింది "ఎందుకు వచ్చావు?" అన్నాడు, విసుగ్గా. ఆ కంఠం విని ఆమె భయపడింది. మాట్లాడలేదు. ఆమెలో ఏదో కోరిక కలిగింది.

తన సమస్తమూ అతనికి ఇచ్చివేసి తాను శూన్యంగా బికారిగా వుండాలనిపించింది. కాని, తాను నిజంగా బికారి. ఇంకా ఇవ్వడానికేముంది! ఆమె మెడలో వెండిపూసల దండ వుంది. అది గుండెలమీద బరువుగా వుంది. అప్రయత్నంగా ఆమె కాదండ అతనికివ్వాలనిపించింది. అది తీసి భయంతో అన్నది. "ఇది నీకు ఇచ్చి పోదామని వచ్చాను" అని, అతను తెల్లపోయాడు ఒక్కక్షణం అతనికి ఆమెమీద జాలివేసింది. "నాకెందుకు అది" అన్నాడు. ఏమో! నాకివ్వాలని వుంది. ఇంతకన్నా ఏమీ లేదు నా దగ్గర," అన్నది. ఆమెకు కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి. అతను మళ్ళా వుదాసీనంగా వున్నాడు. ఆదండ తీసుకుని యథాలాపంగా తనసంచిలో పడవేశాడు ఆమె అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ఆ దండ కనకాంగి తల్లిది. కూతురు కిచ్చింది. కనకాంగి భర్తపోయిన తరువాత చంద్రమల్లి కిచ్చింది అది ఎప్పుడూ చంద్రమల్లి మెళ్ళోనే ఉంటుంది. ఇవ్వాళ మెడ బోసిగా ఉంది. అది అతని కిచ్చిందన్నా, ఎక్కడైనా పారవేసిందన్నా కనకాంగి చావకొడుతుంది. అది స్ఫురణకు వచ్చినా చంద్రమల్లి బాధపడలేదు. ఏ దెబ్బలైనా ఇప్పుడు ఆమె శరీరానికి నొప్పి కలుగదు.

మధ్యాహ్నం, ఆమెకు మనసు నిలువలేదు. మళ్ళా ఒకసారి అతనిని చూడాలనిపించింది. స్టేషనుకు పరుగెత్తి వెళ్ళింది. ఆ స్టేషను ఊరికి దూరం. అక్కడ ఎప్పుడూ ఎవరూ ఉండరు. ఆ ఎండవేళ అది మరీ ఎడారిలా ఉంది.

హరిరావుఒక్కడే అక్కడ రైలుకోసం ఎదురుచూస్తున్నాడు ఆమెఅతనికి కొంచందూరంగా నిలబడింది. అంతదూరం పరుగెత్తివస్తే ఆమెకు ఒళ్లంతా చెమటపట్టింది. జుట్టంతా రేగిపోయింది. క్రోవన్లో ముళ్ళకంపకు తగుల్కొని చీరకొంగు చినిగింది. ఆమెను చూడగానే అతనికి కోపం వచ్చింది. తన వెంటపడుతుందేమో, అల్లరి పెడుతుందేమోనని భయం వేసింది. "ఎందుకిలా వచ్చావు. ఇలా ఎక్కడికి పడితే అక్కడికి రాకూడదు!" అని కసురుకున్నాడు. ఆమె మాట్లాడలేదు.

"నిన్ను చూడాలన్న తపన, నీవు వెళ్ళిపోతున్నావన్న బెంగ నన్ను నిలువనీయలేదు" అని చెప్పలేదు. ఆమెకు కళ్ళు చెమ్మగిల్లాయి. అతనిముందు గట్టిగా ఏడవడానికికూడా ఆమెకు ధైర్యం లేదు. ఎలాగో మెల్లగా గొణిగింది. "నన్ను కూడా నీతో తీసుకుపో!" అని. అతను అదిరిపడ్డాడు. "ఇది బాగుంది. ఉద్యోగంకోసం ఎన్నివూళ్ళో వెళతాను. ఎంతమందితోనో స్నేహమవుతుంది. స్నేహమైన ఆడపిల్లల నందరినీ కూడా తీసుకుపోతూ వుంటాననుకున్నావా?" అన్నాడు. ఆ మాటలలో కోపం, అసహ్యం, ధ్వనిస్తున్నాయి. చంద్రమల్లికి తనమీద తనకే అసహ్యం కలిగింది. అతను మళ్ళా అన్నాడు.

"నువ్వు వెళ్ళు. అవతల కూలీలు చూస్తున్నారు. ఏమనుకుంటారు! అసహ్యంగా! త్వరగా వెళ్ళు!" అని చీదరించుకున్నాడు. అక్కడినుంచి పోతూ పోతూ ఒక అయిదు

రూపాయల కాగితం ఆమె చేతిలో పెట్టాడు. "ఇది తీసుకో! ఆవేళ బుట్టలు తెచ్చావు. నేను డబ్బు ఇవ్వనేలేదు" అన్నాడు. ఆమెకు ఆ కాగితం చింపి దూరంగా విసరి పారెయ్యాలనిపించింది. అయినా కనకాంగి ఖరీదు ఎప్పుడో అడుగుతుంది. అది జ్ఞాపకం వచ్చి నలిపి ఉండ చుట్టి ఆ కాగితం అలాగే పట్టుకుంది అది నిప్పు కణికలా చేతిలో కాలుతోంది. ఒళ్లంతా మంటలు రేపింది. "మర్చిపోవడానికి ప్రయత్నించు" అని ఆఖరుసారిగా అని, అతను వెళ్ళి పోయాడు. ఆ మాట అంటూ అతను చంద్రమల్లివంక చూడలేదు. ఏదో గాలికి చెప్పినట్లు చెప్పాడు. ఆ మాట కటువుగా, ఏదో కఠినమైన శిక్ష వేసినట్టుంది. "బతికినన్నాళ్లు బాధపడు" అన్నట్లుంది. ఆమెకు ఎవరో తనను బండ రాళ్లతో కొట్టి చంపుతున్నట్లనిపించింది. మెల్లగా, దూరంగా వెళ్ళిపోయింది.

అప్పటికి రైలు వచ్చింది, అతను వెళ్ళి రైలెక్కాడు. రైలు కదలిపోయింది. అతనికి మనస్సంతా ఏదో చికాకుగా ఉంది. చంద్రమల్లి ఎందుకు తనను వెన్నాడిందో, ఆమె ప్రకృతి ఏమిటో అతనికేమీ అర్థంకాలేదు. ఒక్కక్షణం స్నేహంగా వున్నంతమాత్రంచేత తనతో వచ్చేస్తాననటం దేమిటి! తనకు సంసారము, ఉద్యోగము, గౌరవము! అతనికి చంద్రమల్లిమీద కోపం, అసహ్యము కలిగాయి. రైలు ఊరు దాటిపోయింది. అతని మనస్సులో చంద్రమల్లి

మరుగుపడింది. హాయిగా నిట్టూర్పు విడిచాడు. చంద్రమల్లి అక్కడే పొదలమాటున నిలబడింది. రైలు వెళ్ళినవేపే చూస్తూ ఉంది. చాలాసేపు, తరువాత మెల్లగా వెళ్ళిపోయింది.

ఆమెలో చైతన్యం నశించింది. స్పృహలేని వ్యక్తిలా ఉంది. మనస్సులోని వ్యామోహం భరించలేని దుఃఖాన్ని కలిగిస్తోంది. అతని కాఠిన్యం కత్తితో కోసినట్లుంది. ఒంటరిగా వెళ్ళి, దిగుడుబావి మెట్లమీద కూర్చుంది. తనజీవితం తారుమారయింది. చివరిమెట్టుకు దిగజారింది. ఇంక జీవలాగే తన బ్రతుకు శిఖండి బ్రతుకు అవుతుంది. ఇంక తన కెవరిమీదా మమకారం కలుగదు. ప్రాణం వున్నన్నాళ్ళు దుఃఖము దహిస్తూనే ఉంటుంది. మృత్యువులోనే విముక్తి! కాలుజారినట్లు ఈ నీళ్ళలో మునిగితే, ఈ దుఃఖము తొలగిపోతుంది. తన బ్రతుకుకు అదే తగిన ముగింపు. ఇంకొక మెట్టు క్రిందకు దిగింది. నీళ్ళలో అడుగు పెట్టింది, మళ్ళా పైమెట్టు పట్టుకుంది. ఒక్కక్షణం ఆమెకు ఏమీ తోచలేదు. ఇల్లు, ఇంటిదగ్గర వ్యక్తులు స్ఫురణకు వచ్చారు. అమ్మ, తాతా, తమ్ముడు ముగ్గురూ ఎప్పుడూ తనకోసం ఎదురుచూస్తూ ఉంటారు. తను రాకపోతే బాధపడుతారు. ఈ నీళ్ళలో మునిగిపోతే వారికి తాను భరించలేని దుఃఖాన్ని కల్పిస్తుంది. ఈ శిక్ష వెయ్యడానికి వారు తనకే అపకారం చెయ్యలేదు. ఈ వేదన లోలోపల భరించడమే మేలు, మనస్సు మగతబారింది. తడిసిన బట్టలతో మెల్లగా ఇంటికి వెళ్ళింది.

ఆమె ఎప్పుడూ మళ్లా బయటికి పోలేదు. ఏ తిరుణాల అయినా ఎవరు వచ్చినా ఎవరిముఖము చూడలేదు. బొమ్మలా తల్లితో కూడా కూడా తిరిగింది. కలిసి పని చేసింది. పని లేనప్పుడు వెళ్లి, దిగుడుబావి మెట్లమీద దిగులుపడుతూ కూర్చుంది. కనకాంగి కూతురు మారిపోయిందనుకుంది. చంద్రమల్లికి పెద్దరికం వచ్చిందనుకుంది. ఆమె చితికి పోయిందని తెలియలేదు.

అర్ధరాత్రి అందరూ నిద్రపోతున్నప్పుడు చంద్రమల్లి మేల్కొని కూర్చుంది. అంతవరకు మగతగా వున్న ఆమె దుఃఖము ఆ రాత్రివేళ దహించివేసేది. ఆమె ఆత్మ మౌనంగా కుమిలి కుమిలి ఏడ్చేది. ఆ ఏడుపు దూరానవున్న హరిరావుకు ఎప్పుడూ వినిపించలేదు.